
# తాపీ ధర్మారావు తో



(తాతాజీ అని అంతా అప్యాయంగా పిలిచే తాపీ ధర్మారావుగారు విజయవిలాసం చదువుతూ వ్యాఖ్యానిస్తూ వుంటారు. కళాప్రపూర్ణ త్రిపురాన సూర్యప్రసాదరాయ కవి, మహామహోపాధ్యాయ ఆచంట సాంఖ్యాయన శర్మ, ఆంధ్ర వాల్మీకి వడ్డాది సుబ్బారాయ కవి, ప్రథమాంధ్రాస్థానకవి శతావధాన శిరోమణి కాశీ కృష్ణాచార్యులు చుట్టూ కూర్చుని ఆలకిస్తూ వుండగా వేదము వెంకటరాయశాస్త్రి గారు ప్రవేశిస్తారు )

**త్రిపురాన సూర్య ప్రసాదరాయ కవి**

విజయవిలాస కావ్యమున వేంకట సత్కవి చూపినట్టి య
క్కజమగు నందియందని యొకానొక చందపు పల్కుటందముల్
నిజముగ విప్పి చెప్పితివి నేర్పుద’వ్వగ నీదు వ్యాఖ్యది
గ్విజయము గాంచుగావుత వివే: నిధానమ ధర్మరాట్కవీ!

**ఆచంట సాంఖ్యాయన శర్మ**

చతురమగు వేంకటరాయశాస్త్రి బుద్ధి
కందనట్టి యందములు నీదు వ్యాఖ్యఁ జూసి
చూపినాడవు మాకు నీ సూక్ష్మబుద్ధి
ఔర! ఆంధ్ర విశారదుండగుదు నీవు

**ఆంధ్ర వాల్మీకి వడ్డాది సుబ్బారాయకవి**

చరితయు అర్థ పుష్టియు రసస్ఫురణంబు గభీరభావ బం
ధురతయు మాకరంద రసతుందిల సత్పద గౌరవంబులున్
వెరపున జూపినాడవు వివేకులు మేలన ధర్మరాయ నీ
సురుచిర నామ మాంధ్రమున సుస్థితి గాంచును వాఙ్మయమ్మునన్

**ఆస్థానకవి కాశీ కృష్ణాచార్యులు:**

కవికిన్ గల్గునొ కల్గదో యనెడు శంకన్ గల్గగా జేయున
ర్థ విశేషంబులు చేమకూర కవి పద్యాలందు జూపించినా
వవురా! మెచ్చితి మామకాగమన వార్తాఖ్యా స్థలంబందు నీ
వివృతిం, బొంగితి నీదు చాతురికి తాపీవంశ ముక్తామణీ.

**తాపీ ధర్మారావు:** క్షమించాలి! అనాడు నాకు కలిగిన అభిప్రాయం మనవి చేస్తాను. వేదం వారు అనేక పద్యాలలో సరైన వ్యాఖ్యానం యివ్వలేదనీ, ఎన్నో అందాలను ప్రకటించలేదనీ కావ్య గుణాలనూ, నియమాలనూ పూర్తిగా వారు గుర్తించ జాలక పోయారనీ అనుకున్నా. (పెద్దలు అంతర్ధానం) అదే నా విచారం!

**మధురవాణి**. ఏ యెడ మేలె చూతురు గణింపరు జ్ఞానులు జారుపాటులన్ (నవ్వు)

**తాపీ:** అవుననుకో - నా పాండిత్య ప్రకర్ష కోసం గాని, ఇతర వ్యాఖ్యానాల్లో తప్పులు దిద్దడానికి గాని నేను ఈ వ్యాఖ్యానానికి పూనుకోలేదు

**మధుర:** ఆపండి స్వోత్కర్ష - మీరు పండిత మర్యాద కోసం అలా అంటున్నారు కాని చేసింది వేదం వేంకట రాయశాస్త్రిగారి వ్యాఖ్యానంలో తప్పులెన్నడమేగా!

**తాపీ:** తప్పదు మరి. మనం పెద్దవాళ్ళ భుజాల మీద నిలబడి ప్రపంచాన్ని చూస్తాం నిజమే. కాని వారి తప్పుల్ని సవరించుకోవలసివస్తే అందుకు అభిమానపడి ఏం లాభం? ఓ నమస్కారం పారేసి దిద్దుకోవాలి

**మధుర:** మీరు అభ్యుదయ కవులు-మార్క్సిస్టులు అవునో, కాదో తెలీదు గాని అభ్యుదయ రచయితల సంఘం మూలస్థంభాలలోని వారు, పైగా కమ్యూనిస్టులు మీరు ప్రబంధ సాహిత్యానికి కొమ్ము కాయడం ఏ విధంగా సమర్థనీయం?

**తాపీ:** నేను అభ్యుదయ సాహిత్యాన్నీ ఉద్యమాన్నీ సమర్థిస్తాను గనక ప్రబంధ సాహిత్యం మీద విమర్శకూ వ్యాఖ్యానించడానికీ తగనా?

**మధుర:** అవి బూతుల బుంగలనీ ప్రజాసాహిత్యం కాదనీ మీ వాళ్ళు గొంతు చించుకుని అరుస్తారు గదా! ప్రజాసాహిత్యం కానిదాన్ని మీరెలా నెత్తికెత్తుకున్నారు?

**తాపీ:** చేమకూర వెంకటకవి నా అభిమానకవి పైగా శాస్త్రిగారి వ్యాఖ్యానం మీద ఏర్పరచుకున్న అభిప్రాయం కొంత చెదిరింది ఈ రసవత్తర కావ్యానికి సరియైన వ్యాఖ్యానం యింకా రాలేదని కొంత విచారించా

**మధుర:** ప్రబంధ సాహిత్యాన్ని పార్టీ దృక్పథం నుంచి ఖండించిన మీరే ఒక్క విజయ విలాసాన్ని హృదయోల్లాస వ్యాఖ్య రచించి పైకెత్తి చూపారేమి?

**తాపీ:** అది నాకు ఒక సర్దా వ్యాఖ్యానం వ్రాయడమనగానే గుండె బ్రద్దలయింధి నేనొక కాలేజీలో లెక్కలు చెప్పే మాష్టర్ని ఆంధ్ర సాహిత్యంలో నాకున్న సర్దాతో నా సాహిత్య పరిశ్రమ వ్యాఖ్యాన రచనకు చాలదు ఆ సంగతి నాకే బాగా తెలుసు

**మధుర:** అంటే సంప్రదాయ పండితుల కంటె మీరు గొప్ప అని మీకు తెలుసు. మీ ఆధిక్యాన్ని నిరూపించడం కోసమా? చేమకూర కవి పద్యాల రుచి ఎత్తి చూపడమా? ఏది మీ లక్ష్యం? పైకి ఒకటి లోపల మరొకటి కాదు గదా?

**తాపీ:** నా అభిమాన కవి కావ్యానికి వ్యాఖ్య రచించడానికీ, అభ్యుదయ కవితోద్యమానికీ వారి ఆదర్శానికీ ఏమీ సంబంధం లేదు. ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా అని వాపోయిన కవికి వ్యాఖ్య చేసి న్యాయం చేకూర్చాలనుకున్నాను. చేశాను.

**మధుర:** అంచాత మీ అభ్యుదయ కవులు పూర్వకవుల్నీ కావ్యాల్నీ ప్రబంధాల్నీ తిట్టడం తగ్గించుకుని మీలాగే బుద్ధిగా అదీ యిదీ కూడా చదువుకుని ఆనందించాలని చెప్పండి మీరు వాళ్ళ నోళ్లని మూయిస్తే సంతోషిస్తా

**•పి ధర్మారావు**

**తాపీ:** కొంత పాత కవిత్వం ధ్వంసమవుతుంది అన్యాయంగా. కొత్త మార్గం వేసినపుడు చెట్టూ పుట్టా అడివీ ఆకూ అలమూ అంతా కొట్టుకు పోతుంది గదా, యిదీ అలాటిదే.

**మధుర:** మరి విజయవిలాస హృదయోల్లాస వ్యాఖ్య మీ వేగుచుక్క గ్రంథమాలలోనే వేస్తే సరిపోయేది కదా?

**తాపీ:** మద్రాసులో విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి వారూ, బందరులో ఆంధ్ర భాషాభివర్ధనీ గ్రంథమాల వారూ మంచి మంచి గ్రంథాలు ప్రచురిస్తూ వుండే వారు. అప్పుడు మేము కూడా వేగుచుక్క గ్రంథమాలను స్థాపించి, వారు చరిత్రలూ, విజ్ఞాన శాస్త్రాలూ ప్రచురిస్తూంటే మేము వారు విడిచిపెట్టిన సాహిత్య శాఖలనే - డిటెక్టివ్, చారిత్రక నాటకాలూ, స్వీయానుభవాలుగా రాసిన నవలలూ ప్రధానంగా ప్రచురించాము పౌరాణికమని నేను రాసిన విలాసార్జున నాటకాన్ని అప్పట్లో ప్రకటించలేదు అప్పుడు యీ విజయ విలాస వ్యాఖ్య అందులో యిమడలేదు ప్రచురించలేదు

**మధుర:** చేమకూర వేంకటకవిగారు కూడా నాయుడని మీరు పరవశించారేమోనని నేను పొరబడ్డాను. క్షమించాలి (నవ్వు)

**తాపీ:** అందుకే ఆ రోజుల్లో అగ్రవర్ణస్థ కవులు యితర కులాల నుంచి వచ్చిన కవుల్ని చిన్నచూపు చూసే వారనే బాధపడి చేమకూర వేంకటకవి ' ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా' అని వాపోయాడు అంత ప్రతిభావంతుడైన కవికి వ్యాఖ్యానం చేయడం గౌరవంగా విధిగా నేను భావించాను కులాల ప్రసక్తి అంటే - విశ్వనాథ వారు, చమత్కారానికే అనుకో - కవికోకిల పంచమ స్వరంలో ఆలపిస్తోంది అని అనలేదా? ఆ రోజుల్లో అదీ వాతావరణం

**మధుర:** శతాబ్దాలు మారినా మనస్తత్వం మారలేదు మీరు విశాఖపట్నంలో స్థాపించిన కవితా సమితి గురించి శ్రీశ్రీ గారి జోకు చెప్పమంటారా?

**తాపీ:** చెప్పు నీ కడ్డేవిటి?

**మధుర:** సున్నం మీర్రాజుగారు, తాపీ ధర్మారావుగారు, రాళ్ళబండి కుటుంబరావు గారు ఇలా చాలమంది వున్నారు. మరి సున్నం వుండీ, తాపీ వుండి, రాళ్ళబండి వుండి కవితా సమితికో సొంత భవనం లేకపోయిందే అని

**తాపీ:** మా యింటిపేరు పూర్వం తాపీ వారు కాదు అది పౌరుష నామం

**మధుర:** తాపీ అంటే స్లో అని కూడా మీ హృదయోల్లాస వ్యాఖ్యతో ఒక పద్యం చదివి వినిపిస్తారా? అఁ హఁ .. విని ఆనందిస్తా.

**తాపీ:**
చిత్తజు డర్గి తూపు మొనచేసినఁ జేయగనిమ్ము - పై ధ్వజం
బెత్తిన యెత్తనిమ్ము వచియించెద గల్గిన మాట గట్టిగా;
నత్తరళాయతేక్షణ కటాక్ష విలాస రస ప్రవాహముల్
కుత్తుకబంటి తామరలకున్ దలదమ్ముల్కలు గండు మీలకున్.

ఈ పద్యంలో చేమకూర వేంకటకవి సుభద్ర కన్నులు పద్మాల కంటె గండు మీల కంటె అందంగా వుంటాయని చెప్పాడు. జల ప్రవాహం పద్మానికి మెడదాకా, చేపలకు తలమునిగేలా వుండటం సహజం. ఆమె పద్మదళాయతాక్షి మీనాక్షి కూడా. పద్మం మన్మథుని బాణం. చేప ధ్వజం. తన ఆయుధాలను సుభద్ర కించపరచింది అన్న కోపంతో మన్మథుడు తన ఆయుధాలను పైకెత్తినా అవి క్రమంగా సుభద్ర కటాక్ష విలాస రసప్రవాహాలు కుత్తుక బంటిగానూ తలముస్కలు గానూ వుంటాయని అంటాడు అర్జునుడు. ఈ పద్యంలో శృంగార రసపు జాలు-ప్రవాహమే ఈ పద్యమునందలి కటాక్ష విలాస రస ప్రవాహం.

**మధుర** : పైకి అభ్యుదయ కవులు అయినా శృంగార ప్రబంధాలు చదువుకుంటే మీ వంటి వారి వద్ద చదువుకోవాలి. అవునూ, మీ గురువుగారు గిడుగు రామమూర్తి పంతులుగారు మీ వైపు వీపు త్రిప్పి ముఖం చూడకుండా పాఠం చెప్పే వారటగా -?

**తాపీ:** వ్యావహారిక భాషావాదాన్ని వ్యతిరేకించే వాడ్నని నా మీద కోపం - నేను ముందు గ్రాంథిక భాషావాదిని

**మధుర:** (నవ్వి) మీకుండే తిక్కలలో అదోటి కాబోలు. అయినా మీకు పేరు వచ్చింది అందుకూ యిందుకూ కాదు - 'దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు' రాసినందుకు కదా!

**తాపీ:** కవికి తన యిష్ట రచన ఓటి వేరుగా వుంటే దానికి గాక మరోదానికి పేరు వస్తే కించిత్తు చింతగానే వుంటుంది ఏం చేస్తాం?

**మధుర:** అవన్నీ బయట పెట్టి మీరు మన దేవాలయ సంస్కృతి మీద గౌరవం తగ్గించినట్లా, పెంచినట్లా?

**తాపీ:** లక్ష్యం సత్య నిరూపణమే కాని ఎవరేమనుకొంటారని కాదు.

**మధుర:** అలా చెప్తారు గాని మీ కమ్యూనిస్టులకు మన మతం మన సంస్కృతి అంటే చిన్నచూపు. రష్యాలో వాన కురిస్తే యిక్కడ గొడుగు పడతారన్నది నిజమేనా?

**తాపీ:** ఏదైనా శృతి మించితే అగ్గజంగానే వుంటంది అభ్యుదయ కవిత్వయుగం రాకపోతే మనవాళ్ళు యింకా ప్రేయసీ, ప్రేయసీ అంటూ కలవరిస్తూ వుండే వాళ్ళు; 'వేయి కన్నులతోడ వెదకుచున్నానే' అంటూ

**మధుర:** విశ్వనాథ తన నవలల్లో చిత్రించిన తెలుగు సామాజిక జీవితం మీకెవరికీ అందలేదు ఆయన తర్వాత నవల తిన్నగా నిజాయితీగా రాసిన వాడేడి?

**తాపీ:** అన్యాయంగా మాట్లాడకు. రావిశాస్త్రి అల్పజీవి, గోవులొస్తున్నాయి జాగ్రత్త, రాజు-మహిషి, దాశరథి రంగాచార్య జనపథం, జి.వి.కె. కీలుబొమ్మలు, బీనాదేవి హేంగ్ మిక్విక్, వట్టికోట ఆళ్వారు స్వామి ప్రజల మనిషి, గంగు యివన్నీ ఏమిటి?

**మధుర:** నేను చెప్పినది బ్రిటీష్ వారి కాలంలో, డిప్రషన్ రోజుల్లో జీవితం గురించి - సరే. అదలా వుణ్ణీండి. రైతుబిడ్డ సినిమా ఎలా తీశారు?

**తాపీ:** అంటే ? (నవ్వు)

**మధుర:** జమీందారుల సొమ్ముతో; వాళ్ళకు తెలియకుండా; జమీందారీ విధానాన్ని వ్యతిరేకించే చిత్రం తీయడం సాహసం కాదా!

**తాపీ:** జమీందారీ భూస్వామ్యయుగం అంతరించి పోవలసినదే ఏం చేస్తాం? కొన్ని అలా జరుగుతాయి వాళ్ళకీ తెలుసు తమ వ్యవస్థ అంతరించి పోయేది నిజం అని

**మధుర:** అసలు మీరు రాకముందు సినిమాలకు స్క్రిప్ట్ అనేది వుండేది కాదంటారు నిజమా?

**తాపీ:** నువ్వు అడిగావు గనక చెబుతున్నా. అంతకుముందు డైరెక్టర్లు కవిగారు కూచుని ఏదో రాసుకుని దాన్నే మార్చుకుని తీసేవారు. నేను విధిగా స్క్రీన్ ప్లే రైటింగ్ డెవలప్ చేశాను. కవి చేసే పని కూడా డైరక్టరు చేయాల్సొచ్చేది డైరక్టర్‌కి స్క్రీన్‌ప్లే చేతికంది వస్తే పని సులువు కాదా! బొమ్మ కూడా బాగా వస్తుంది

**మధుర:** దిన పత్రికల భాష గొడ్డు గ్రాంథికం వుండేదటగా మీరు రాకముందు.

**తాపీ:** అవును. నేనే మొట్టమొదట వ్యావహారికంలో పత్రికా రచనచేసి చూపెట్టాను. శీర్షికలు వ్యాఖ్యలు అన్నీ సరళ వ్యావహారికంలో నడిపించాను జనవాణిలో సంఘ సంస్కరణా, ఆ వెనువెంటనే భాషా సంస్కరణా-

**మధుర:** మాలపిల్ల సినిమాకి డైలాగులు చలం గారు రాశారా మీరా ?

**తాపీ:** స్క్రిప్ట్ వర్క్ నేను చేశాను కొన్ని డైలాగులు ఆయన రాశారు.

**మధుర** : మీకు సినిమాల వల్ల ఎక్కువ పేరొచ్చిందా, జర్నలిజం వల్లా?

**తాపీ:** నేను పండితుడ్ని, వచన రచయితను, విమర్శకుడిని. వ్యావహారిక భాషకు వచనంలో శైలిని నిర్ధారించిన వాళ్ళలో ముఖ్యుడ్ని. రామ్మూర్తి పంతులు గారి కలలు పండించిన శిష్యుడ్ని. సినిమా వల్లా జర్నలిజం వల్లా పేరు రావడం నిమిత్త మాత్రం.

**మధుర:** పెద్దల్ని కాదనడం; మీ సొంత మార్గాన కొత్త దారిని వెళ్ళడం మీకు సర్దా అలా మీరొక చరిత్రాత్మక కర్తవ్యాన్ని నిర్వహించారు అవునా?

**తాపీ:** నేను గాకపోతే మరొకరు చేసేవారు ఆ పని ఎవరు లేకున్నా వున్నా ఆగేది కాదు. పండిత భిషక్కుల భాషాభేషజం నశించింది.

**మధుర:** ఉన్న వాళ్ళ భాష, లేని వాళ్ళ భాష-అంటూ భాషకు వర్గ స్వభావం అంటగట్టారు శ్రీశ్రీ. దాని సంగతేమిటో?

**తాపీ:** అది ఒక దృష్టి. ఆ దృష్టితో చూస్తే అలానే కనిపిస్తుంది.

**మధుర:** యద్భావం తద్భవతి అంటారు?

**తాపీ:** కాదు. మార్క్సిస్టు దృక్పథంతో చూస్తే అలా కనిపించి తీరుతుంది. రైటా రాంగా అనేది తర్వాత.

**మధుర:** మీ భాషనీ మీ శైలినీ అనుకరించే వారు ఒకరు వున్నారు. మీ రచనలో జాతీయాలు, సంస్కృతంలోవి కంటె తెలుగువి ఎక్కువ వాడతారనుకుంటా. ఎందుకంటే మీ జీవిత చరిత్రకు 'రాళ్ళు -రప్పలూ' అని మొరటైన పేరు పెట్టుకోవడం సాహసమా, కాదా; చెప్పండి! (నవ్వు)

**తాపీ:** గతుకుల జీవితం అని చెప్పడం నా ఉద్దేశం.

**మధుర:** మీ శైలిని తూచా తప్పకుండా అనుకరించే వాడు ఎ బి.కె. అని గిరీశంగారు ఓసారి మాటల్లో అన్నారు.

**తాపీ:** గిరీశం ఎ.బి.కె సంపాదకీయాలు చదువుతాడుగావల్ను. శ్రీశ్రీ-షష్టిపూర్తికి పాపం జైల్లో వున్నాడు.

**మధుర:** అన్నట్లు శ్రీశ్రీ షష్టిపూర్తి సభకి మీ రధ్యక్షులట గదా! ఆరుద్ర అలక కూడా ఆ సభకు అదో ముచ్చట శ్రీశ్రీ గారి నెగెటివ్ దృక్పథాన్ని మీరు సమర్థిస్తారా?

**తాపీ:** నెగెటివ్ దృక్పథం అంటే-

**మధుర:** మరేం లేదు. స్వాతంత్ర్యం వచ్చిందనుకోండి అఁహఁ, ఇది స్వాతంత్ర్యం కాదు; ఏదో వుండు అనటం ఆంధ్ర రాష్ట్రం వచ్చిందనుకోండి. ఇది అది కాదు. యింకేదో అనటం మనదేశంలో యిలా వుంది అని చెప్తామనుకోండి, యిది మనదేశం కాదు మరోటి అనడం

**తాపీ:** అలా ఎవరంటున్నారు? శ్రీశ్రీయా-

**మధుర:** ఈ స్వాతంత్ర్యం మేడి పండు అన్నది శ్రీశ్రీ యే. నెగెటివ్ దృక్పథం అంటే - దీన్ని కాదని యింకెక్కడో ఏదో వున్నది అది యిక్కడకు తెస్తామని గప్పాలు కొట్టడం

**తాపీ:** నాది అటువంటి మతం కాదు నేను రష్యా భక్తుడ్నీ కాదు; చైనా భక్తుడ్నీ కాదు అవునూ, నువ్వు కాంగ్రెసు భక్తురాలివా?

**మధుర:** కాను . కాను.. నాకు యం యన్ రాయ్ నవ్య మానవతా వాదం నచ్చింది. ఎందుకంటే మానవ చైతన్యానికీ హేతువాదానికీ విలువనిచ్చాడు రాయ్, మహానుభావుడు

**తాపీ:** కమ్యూనిజానికీ మానవతా వాదానికీ చుక్కెదురు. రష్యాలో కమ్యూనిజం ఫెయిలయిందనా అలా అంటున్నావు?

**మధుర:** ఒకప్పుడు బెజవాడను ఆంధ్రా మాస్కో అన్నారు. వాళ్ళ పేర్లు తగిలించుకోడం, వాళ్ళను తెగ అనుకరించడం - చివరికి అక్కడ స్టాలిన్ యుగం ఎప్పుడో అంతరించినా యిక్కడి తీవ్రవాదులు స్టాలిన్ భజన చేస్తున్నారు యింకా

**తాపీ:** కమ్యూనిజం పోయినా మార్క్సిజం ఒక సిద్ధాంతంగా ఒక దర్శనంగా యింకా వుంటుంది. పోతే ఫ్యూడల్ కమ్యూనిస్టులు పోతారు

**మధుర:** రెడ్ స్క్వేర్‌లో లెనిన్ మసోలియంలోని లెనిన్ భౌతిక కాయాన్ని లేపేస్తార్ట. ఆయన స్మృతికి మహా అపచారం కాదా?

**తాపీ:** గౌరవ అగౌరవాలు మానావమానాలు బ్రతికున్నవారికే గాని అమరజీవులైన ఆ మహాత్ములకు కాదు. మీరు పూజించినా దూషించినా అవి వారిని అంటవు.

**మధుర:** ఇంటికి జ్యేష్ఠాదేవి, పొరుగ్కి శ్రీ మహాలక్ష్మి అన్నట్లు వుంటాయి మనవారి సుత్తీ కొడవలి మార్క్సు చేష్టలు. వీళ్ళని ఆత్మ విధ్వంసకులు అన్నా తప్పులేదు.

**తాపీ:** నువ్వు పొరబడుతున్నావు మధురవాణీ. ఏ సిద్ధాంతం అయినా ఆచరణలో మనుష్యుల వలననే భ్రష్టు పడుతుంది. కమ్యూనిస్ట్ పార్టీ కూడా అలానే ప్రజల్ని విస్మరించి సిద్ధాంతాన్ని పట్టుకుని పిడివాదాలు చేసి నానా భ్రష్టూ అయింది. అది ఎప్పుడు ఒక మతం స్థాయికి చేరి తిరుగులేని వేదాంతంగా మారిందో అప్పుడే నియంతృత్వ పోకడలూ అవాంఛనీయ ధోరణులూ తలెత్తి మొత్తం తుడిచి పెట్టుకుపోయేలా చేశాయి ఈ జబ్బును కొంతవరకు రాయ్ ముందుగానే పసికట్టాడు

**మధుర:** ఏది ఏమైనా నాటకాలు, సినిమాలు, సామాజిక స్పృహగల కథలు వచ్చి సాహిత్యాన్ని సుసంపన్నం చేయలేదా? కుటుంబరావు గారు యిప్పుడుంటే యిదంతా చూసి ఏమంటారో?

* * *

(దేవాలయం మంటపంలో కూచుని గిరీశం చుట్ట చుట్టుగుంటూ టుమ్రీ విసురుతూ వుంటాడు తాతాజీ వెంకటేశాన్ని వెంట బెట్టుకుని దేవాలయం మీది బూతుబొమ్మల్ని చూపిస్తూ శిష్యుడికి వివరిస్తూ వుంటారు )

**మధురవాణి:** కుర్రవాడ్ని పాడు చేస్తున్నారు గురువుగారూ!

**తాపీ** : ఆదిలోనే హంసపాదు. నేనింకా శిష్యుడికి 'పెళ్ళి' దాని పుట్టుపూర్వోత్తరాలూ' చెబుతామనుకుంటూ వుంటే-

**మధుర:** మీరివన్నీ తెలుసుకున్నాకే పెళ్ళి చేసుకున్నారా? గిరీశంగార్నడిగితే దేవాలయాల మీద బూతు బొమ్మలు వుండాల్సిందే. ఎ మస్టు అంటారు. అవిలేకపోతే దేవాలయాలకు ఎవరు వెళ్తారు? వెళ్ళి ఎవరు ప్రదక్షిణలు చేస్తారు?

**తాపీ** : అది సర్లె కాని, నీలాంటి రసికురాలి చేతిలో భగవద్గీత పెడతాడా సౌజన్యారావు పంతులు? తల్చుకుంటేనే నాకు వళ్ళు మండుకొస్తూంది.

**మధుర:** మరేం పెడితే బాగుండునని మీ అభిప్రాయం

**తాపీ:** ఏ జయదేవుడి గీత గోవిందమో లీలాశుకుని కృష్ణలీలా తరంగిణో. .

**మధుర:** అయితే భగవద్గీత ఎవరికిస్తే బాగుండేదంటారు?

**తాపీ:** గిరీశానికి; పనిష్మెంటుగా

**మధుర:** (నవ్వు) నేను మటుకు చదివానేమిటి?

**తాపీ** : మరేం చేశావు పంతులు నీ కిచ్చిన పుస్తకాన్ని?

**మధుర:** నాదగ్గరెందుకని మా అమ్మకు తోలేశాను

**తాపీ:** ఔరా! నీ చాకచక్యం

**మధుర:** ఆంధ్ర విశారద అన్న బిరుదు మీ కెవరిచ్చారో?

**తాపీ:** శృంగపురాధినాథుడు ప్రసిద్ధ జగద్గురు శంకరుండు న
న్నుంగని ''శారదాంబిక కనూన కటాక్షము గల్గె; నింకఁ బూ
జంగను ముత్తమోత్తమ యశంబుల ''నాంధ్ర విశారదా'' యటం
చుం గరుణాతిరేకమునఁ జూపఁబులెన్న బహూకరించినన్

**మధుర:** ఆ రోజుల్లో రామ్మూర్తి పంతులు గారిని ప్రతిఘటించి నిలిచిన మీ గ్రాంధిక భాషావాదం కబుర్లు సెలవిస్తారా, వింటాం

**తాపీ:** యాభయి సంవత్సరాల నాటి మాట. అప్పుడే శ్రీ గిడుగు రామమూర్తి పంతులు గారు గ్రాంథిక భాష మీద ధ్వజమెత్తారు వారి వాదనను ప్రతిఘటించాలి మూడేళ్ళకు ముందు నేను పర్లాకిమిడి కాలేజిలో వారి శిష్యుడను, వారి జ్ఞానము, దీక్ష, వాదన పటిమ బాగా ఎరుగుదును నాకా! గ్రాంథిక భాషాభిమాన బలము తప్ప వేరు సాయము లేదు. శ్రోతల ఆదరణ నార్జించుకోవడానికి ఒక ఉపాయముగా చిన్న కల్పనతో చంపక మాలికా పద్యరూపమున నా వాదనోపన్యాసాన్ని ప్రకటించాను

**మధుర:** మిమ్మల్ని ఎవరూ ఎదుర్కొనలేదా?

**తాపీ:** లేకేమి. నా చంపకమాలికకు ప్రత్యుత్తరమా అన్నట్లు శ్రీ సెట్టి లక్ష్మీనరసింహం మేష్టారు ఒక శార్దూలమాలిక ప్రకటించి నా వాదాన్ని ఖండించారు లే.

**మధుర:** అయితే యీ కలభాషిణి యెవరు?

**తాపీ:** నా చంపకమాలికలో ''తెలుంగనెడు కాంత'' కథ చాలామంది పండితుల అభిమానాన్ని సంపాదించుకుంది. ఆ ప్రోత్సాహంతో నేను ఆ కాంతకు కలభాషిణి అన్న పేరు పెట్టి ఆమె స్వీయచరిత్ర రూపంగా ఆంధ్ర భాషా చరిత్రను శ్రీ వీరేశలింగం పంతులు గారి వరకు వ్రాశా వేగుజుక్క గ్రంథమాలలో 1911లో యిదే ప్రథమ పుస్తకంగా ప్రచురించాము. ఆ పుస్తకం పేరు '' ఉషః కాలము ''

**మధుర:** అవి ఎలాటివో మచ్చు చూపిస్తారా?

**తాపీ:** నిలయము జెంద గ్రామ్యమను నిక్కపు పాదరసంబు గూర్చి వ
న్నెల కనకంబు మా తెలుగు నీరసమౌనటు జేయకుండ, మ
మ్మలరగజేసి, మీరు సుఖమందుచు నుండు, డటంచు గోరి, దో
సిలి నొసరించి మ్రొక్కెదను చేకొను డార్యులు, ధర్మరాయుడన్!

**మధుర:** తరవాత?

**తాపీ:** మరి యిర్వైయేళ్ళ తరువాత భాషను గురించి నా అభిప్రాయాలు మారాయి. భాషాభ్యుదయానికీ, ప్రజల విజ్ఞానాభివృద్ధికీ, రచనలు వ్యావహారికంలో వుండాలన్న దృఢ విశ్వాసం కలిగింది అందుచేత యీనాడు ఈ ''చంపకమాల'' లోని విషయం నిరుపయోగమయిందనే చెప్పాలి

**మధుర:** ఇదంతా పాత పాళీ వ్యవహారమన్న మాట. మరి కొత్త పాళీ అంటే ఏమిటి?

**తాపీ:** కవులకూ, ప్రజలకూ మధ్యను పెరిగిపోయిన కొండలూ, అడవులే పోవాలన్న రచనలు వ్యావహారిక భాషనే సాగాలన్న నమ్మకం కుదిరింది ఆ నమ్మకాన్నే ''కొత్త పాళీ'' గ్రంథ రూపంగా 1956లో ఆంధ్ర మహాజనులకు అందజేసుకున్నా ఆ భాషలోనే దినపత్రికను వార పత్రికలను నిర్వహించి సినిమాలలో - పౌరాణిక చిత్రాలలో కూడా వ్యావహారిక భాషనే అందరూ అంగీకరించేలా ఉపయోగించా ఈనాడు ఎవరో విశ్వనాథలాంటి వారు తప్ప (త్రిపురనేని వారు కూడా) అంతా వ్యావహారికానికి తరలి పోయారు.

**మధుర:** శ్రీశ్రీ గ్రాంధికం కలవారి భాషనీ వ్యావహారికం పేదల భాష అనీ అన్నారు మీరు ఆ విభజనను అంగీకరిస్తారా?

**తాపీ:** అది అతను చమత్కారం కోసం అని వుంటాడు భాషకు వర్గ స్వభావాన్ని అంటగట్టడం దుస్సాహసమే

**మధుర:** దేశోద్ధారకుల జాబేమిటి?

**తాపీ:** దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు గారి స్వహస్తాలతో విచిత్రమయిన జాబు వచ్చింది '' ఈ సంవత్సరం గూడా తమ రచనతో ఆంధ్రప్రతిక ఉగాది సంచిక నలంకరించవలసింది అని. అప్పుడు నేను నెల్లూరిలో చుండీ జమీందారుకు ప్రభుత్వము నియమించిన సంరక్షకోపాధ్యాయునిగా వున్నా ఆ జాబందినపుడు నా పరిస్థితి ఎలాగుండే దంటే; నాకు ఆనాడున్న ఆస్తి అంతా బంగారము, వెండి, రొక్కము వెలగల వస్త్రాలు అన్నీ దొంగలపహరించుకు పోయారు.

**మధుర:** రామ! రామ! మరి అప్పుడు రాశారా?

**తాపీ:** 'దొరకక చెప్పు టెట్టులని తొంటి కవీశులు సాటగూడదే' అనే మకుటంతో కొన్ని పద్యాలు వ్రాసి పంపా

**మధుర:** మీ ప్రత్యేక విషయం గణితశాస్త్రం కదా మీరివన్నీ ఎలా పట్టించుకున్నారు?

**తాపీ:** మళ్లీ చెబుతున్నా ఆంధ్ర సారస్వతం నా అభిమాన విషయం విశేష పఠనం టాల్‌బోయ్ వీలర్ దొర వ్రాసిన ఇండియన్ హిస్టరీ ఆ రోజుల్లో

**మధుర:** చరిత్ర వల్ల ప్రభావితులై ఏమైనా రాశారా?

**తాపీ:** విజయనగరాంజనేయులు అని వ్రాశా నేను చదివిన చరిత్ర పుస్తకంలోదే ముజాహిద్‌షా కథ మన చరిత్ర పుస్తకాల్లో యీ కథ కనబడదు

**మధుర:** ఏమిటా కథ?

**తాపీ:** భామినీరాజు ముజాహిద్ షాహి చేతులారా ఒక అంజనేయ ప్రతిమను గండ్ర గొడ్డలితో నరకబోతాడు. ఒక ముసలి బ్రాహ్మడు అడ్డు వస్తాడు షాహి మొదట అతడ్ని నరికి, తరువాత విగ్రహాన్ని కొట్టి తన కసితీర్చుకొని పోతూ వుంటాడు. కొన ఊపిరితో ఆ బ్రాహ్మడు మహాపరితప్తమయిన హృదయంతో షాహిని శపిస్తాడు. దాని ఫలితమా అన్నట్లు, ముజాహిద్ షాహి తన యిల్లు చేరకుండా, దారిలోనే, నీచమయిన చావు చచ్చాడు.

**మధుర:** యిలా హిందువుల్ని ముసలీ ముతకాభేదం లేకుండా వధించి, విగ్రహాలు ధ్వంసం చేసిన వీరి వారసులు 15 ఆగస్టు 1947 తరువాత సెక్యులర్ రాజ్యాంగంలో మైనారిటీలయి పోయి మన వారి కంటె ఎక్కువ హక్కుల్తో కాంగ్రెసు వారి దయవల్ల మన నెత్తి మీదెక్కి తొక్కుతున్నారు

**తాపీ:** నీకు కాంగ్రెసు అంటే పడదా?

**మధుర:** ఈ మహమ్మదీయ మహాయుగం నాటి దురాగతాల్ని హిస్టరీని కాంగ్రెస్ వాళ్ళు ఎలా తిరగరాయిస్తారో - మన సెక్యులర్ కాంగ్రెస్ యిష్టానుసారం తిమ్మిని బ్రహ్మి బ్రహ్మిని తిమ్మి చేస్తారు కావును

**తాపీ:** ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం

**మధుర:** మీ కమ్యూనిస్టులు కూడా హిందువులకే మతోన్మాదం అంటగడుతున్నారు కాంగ్రెసు యిటువంటి భ్రష్ట రాజకీయాల మైనారిటీలను నెత్తికెక్కించుకొని ఆడటం దేనికంట?

**తాపీ:** ఎన్నికల ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకొని ఆడే నాటకం రాజకీయ నాయకుడెప్పుడూ రాబోయే ఎన్నికల గురించే ఆలోచిస్తాడు

**మధుర:** సరే వాళ్ల గొడవ అలా వుంచి - రాగి డబ్బు గురించి చెప్తారా?

**తాపీ:** ఆనిబిసెంట్ రోజులవి 1916 దీపావళి వచ్చింది. దీపావళి వసూళ్ళు జమచేసి నాయకుల కందజేసే వారం. అప్పుడు నేను విశాఖపట్నంలో గణిత శాస్త్రోపాధ్యాయుడిని ఉత్సాహంతో వున్న కొందరు విద్యార్థులకు డబ్బా లిచ్చి వసూళ్ళకు వెళ్ళమన్నా, బోణీ మీరే చెయ్యండి అన్నాడొకడు. సరే అని, అన్ని డబ్బాలలోను కాసులు (రాగి డబ్బులు) వేసి పంపించాను.

**మధుర:** ఓహో అదా రాగి డబ్బు అంటే-

**తాపీ:** లేదు ఇంకా ఉంది విను. సాయంత్రం అయిదు గంటల వేళకు హిందూ రీడింగ్ రూం మెట్లెక్కుతుండగా నా విద్యార్థులలో ఒకడు నా ముఖం దగ్గిర డబ్బా వాగిస్తూ

దీపావళి వసూళ్ళు సార్ అన్నాడు. నా జేబులో ఒక అర్థణా డబ్బు మాత్రం వుంది. అర్థణా ఆ డబ్బాలో వేస్తూ - చుట్టల కోసం ఉంచుకున్నా నబ్బాయీ'' అన్నా. అక్కడి నా స్నేహితుడొకడు ''అంత కంటె మంచికే వినియోగం అవుతూ వుంది సంతోషించు'' అన్నాడు. దానితో ఊహలు రేగాయి. ఎన్నింటికో ఉపయోగమయ్యే ఆ రాగి డబ్బు దేశసేవకు వినియోగపడుతూ ధన్యమయిందని అనుకున్నా. ఇంగ్లీషులో ఆటో బయాగ్రఫీ ఆఫ్ ఎ షిల్లింగ్ అనే ద్వ్యర్థి రచన వెలువడింది మనమెందుకు యీ రాగి డబ్బు చరిత్ర వ్రాయకూడదు అనిపించింది.

**మధుర:** బాగుబాగు శ్రీశ్రీ గారన్నట్లు మొత్తానికి కవితామయమేనోయ్ అన్నీ అని ఆయన మాటా రుజువు చేశారు.

**తాపీ:** శ్రీశ్రీ కంటె చాలా ముందు మాట. అతను భావ కవిత్వ యుగంలో పుట్టాడు, మేం వల్లాక్కాదు

**మధుర:** సంప్రదాయ కవిత్వమా? భావకవిత్వమా? దేన్ని మీరు ఎక్కువగా అభిమానించారు?

**తాపీ:** ప్రబంధ కవిత్వ సంప్రదాయంలో వున్న మాకు ఈ భావకవిత్వం కొంచెం వెగటుగానే వుండేది

**మధుర:** ఎందుచేత?

**తాపీ:** వంగదేశ వాసనా ఇంగిలీసు ఎంగిలీ అని అనుకునే వారము, వారి పదజాలం ప్రణయ ప్రకోపం, ఉపమాన సరళీ చూసి నవ్వుకొనే వారం.

**మధుర:** కొత్తని ఆహ్వానించడానికి చాలా ధైర్యం కావాలి గతానుగతికో లోకః నలుగురు నడిచే బాటను నడవటం సుళువు. కొత్త మార్గం వెయ్యటం ఆ మార్గాన నడవటం అంత సులభం కాదు.

**తాపీ:** కొందరు సిద్ధహస్తుల రచనలలోని గుణాధిక్యము గుర్తించి లోలోన మెచ్చుకోకపోలేదు. కాని ఆనాటి భావకవులలో కొందరు ప్రబంధకవులను అవహేళన చేస్తూ ప్రసంగాలు చేయడం సహించలేకపోయేవారం

**మధుర:** మొత్తానికి మీరు చాలా పేచీకోరు మనిషే -

**తాపీ:** నేను పాత కొత్తల మేలు కలయిక

**మధుర:** (నవ్వి) కాదు విచారకరమైన కలయిక. భావకవిత్వం వెనువెంట మనకు కాల్పనిక సాహిత్యం నవల కథానిక అన్నీ వచ్చాయి గదా; మీరే దిక్కునున్నారు?

**తాపీ:** మేము పండిత కవుల పక్షం నుంచి ప్రజల పక్షానికి రావడానికి చాలాకాలం పట్టింది. నేను కూడా మూడు నాలుగు ముత్యాల సరాలు వ్రాసి నాప్రణయ హృదయాన్ని ఒలకబోశాను. ఆ ఖండకావ్యం చిన్న పుస్తకంగా అచ్చు వెయ్యమని ముద్రాలయానికిచ్చాను.

**మధుర:** అన్నట్లు మీ ప్రేయసి ఎవరు? (నవ్వు)

**తాపీ:** వుండు, చెప్పనీ తీరా పుస్తకం అచ్చయిన తర్వాత చూస్తే ఏముంది? 'ణ' బదులు 'ళ' పడ్డది. ప్రణయం ప్రళయం అయింది.

**మధుర:** ప్రెస్సు వాళ్ళని నిలదీసి అడగలేదా మీరు? (నవ్వు)

**తాపీ:** అయ్యో అడిగా, అడగకేమి? 'క్షమించండి ఆ పద్యాలలో మీరు వర్ణించిన దురవస్థ అంతా ప్రణయానికంటె ప్రళయానికే బాగా సరిపోతుంది కదా' అన్నాడు ఆ కంపోజిటర్

**మధుర:** దీనికని రాస్తే దానికి సరిపోతే మీరు భావకవిత్వానికి పనికిరారని తేలిపోలేదా? (నవ్వు)

**తాపీ:** ఆ రోజులలో కొందరు భావకవులు ''మా కవిత్వం ఒక పాతికేళ్ళ దాకా మీకు బోధపడదు లెండి'' అని కొంత అహంభావంతో చెప్పుకొనే వారు వీరంతా ఒకరు వ్రాసిన భావగీతాన్ని మరొకరు ఆకాశానికెత్తివేస్తూ ప్రశంసిస్తూ వుండేవారు. ఇదంతా మాకు దుస్సహంగా వుండేది అది అనాటి మా అభిప్రాయం అది సమర్థనీయం కాకపోవచ్చు

**మధుర:** కొత్త కవిత్వం ఒక ఉప్పెనలా వచ్చిపడినప్పుడు పాత కొంత తుడిచి పెట్టుకు పోతుందిట. దాన్లో కొంతమంచి వున్నా అది కూడా నష్టపోతుంది అని గిరీశం గారు చెప్పారు.

**తాపీ:** చెబితే చెప్పాడు ఏది ఏమైనా నేటి కవులు ఒక్క పూర్వ కవీశ్వరుడినయినా బాగా అర్థం చేసుకొని పఠించినట్లయితే మంచిది

**మధుర:** ముద్దుకృష్ణగారి వైతాళికులు మీరు చూడలేదా?

**తాపీ:** చూడకేమి - నేను చెప్పినవి వెనకటి సంగతులు భావ కవిత్వం తరవాత అభ్యుదయ కవిత్వం, శ్రీశ్రీ, ఆ వెనువెంట వచన కవిత్వం, కుందుర్తి, చాలా దూరం వచ్చింది

**మధుర:** భావ కవిత్వం అది ఎలా వచ్చిందో అలా మాయమయి పోయింది. విచిత్రంగా - ఏమైనా 1890లు గొప్ప సాహిత్య పురుషుల్ని ప్రభవించింది అది అపూర్వమైన కాలం అని గిరీశంగారు చెప్తూండేవారు

**తాపీ:** అన్నిటికీ వీడొకడు ప్రమాణం నీకు పూటకూళ్ళమ్మ ఏం చేస్తోంది?

**మధుర:** యంగ్ విడోసని యిద్దర్ని చేరదీసి విజయనగరం గంట స్తంభం దగ్గర వాసో గారి ప్రెస్ పక్కన భోజనహోటలు నడిపిస్తున్నది. కాలేజి కుర్రాళ్ళ జోరు అక్కడే

**తాపీ:** రామప్పంతులిప్పుడేం చేస్తున్నాడు?

**మధుర:** లుబ్ధావధాన్లు పోయాక మీనాక్షి రిచ్‌విడో అయింది మీనాక్షి పంచన చేరి కాలక్షేపం చేస్తున్నాడు. నన్ను చూస్తే మహా బెదురు - పూట కూళ్ళమ్మకి సలహాలిస్తూ వుంటాడు

**తాపీ:** అప్పారావు గారు పోయినా వీళ్ళంతా చిరంజీవులే-

**మధుర:** ఆంధ్ర తేజంబు గలదె యీ యవని నింక? సందియంబయ్యె - అని ఎందుకు రాశారు? ఇప్పుడు ఆంధ్రుడే ప్రధానమంత్రి కూడా.

**తాపీ:** విజయనగరాంజనేయములో అప్పుడట్లా రాశాను - తరువాత ఏదో మహాపాపం చేసినట్లు ఫీలయ్యాను.

దోసమూనెను మదికిదె దోసిలిడెద
నాంధ్ర తేజమ వందనం బందికొనుము

అని 1923లో వ్రాసి ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ప్రకటించా. సహాయ నిరాకరణోద్యమంలో గాని స్వాతంత్ర్యోద్యమంలో కాని యావద్భారత వర్షములోను ఆంధ్రులదే పైచేయి. గాంధీజీ నియమాలను తూచ తప్పక పాటించి ఎటువంటి త్యాగానికయినా తెగించిన వారు ఆంధ్రులే

**మధుర:** 'రాజులు పోదురు రాజ్యముల్ పోవు
కలకాలముండును కావ్య మొక్కటియె',

అని, 'నా పూలతోట యీ నా జన్మభూమి' అని, రాసింది మీరే కదా!

**తాపీ:** నీకివన్నీ ఎట్లా తెలుసు?

**మధుర:** ద్విపదలు వృత్తమాలికలు కొన్నాళ్ళకి విసుగెత్తించక తప్పవు.

**తాపీ:** అందుకే అభ్యుదయ కవులు తరవాతి తరంవారు మాత్రా ఛందస్సుల్ని పట్టుకున్నారు.

**మధుర:** మీరేం తక్కువ తిన్నారా?

తొలి మీ చూపులు మాటలుం గుణము సంతోషంబుతో జూచి నా
కు లభించుం గద యివ్వి సర్వమని కోర్కుల్ దీగలై సాగ, డో
లల నూగాడితి; నిప్పుడవ్విగని, వాల్లభ్యాప్తి వై మానికో
జ్జ్వల యానంబున సంచరించు బరితోషవ్యోమ మార్గంబులన్... అన్నారుకారా?

**తాపీ:** సెహభాష్ బేటీ కావలసినంత శృంగారరసము దాంపత్య జీవితంలో వుంది అనడానికి, లేదనుకొని పైచూపులకు పోనక్కర లేదని 'దాంపత్యము - శృంగారము' అని వ్రాశా.

**మధుర:** మీ టీచర్ గుణం అక్కడా పోనిచ్చుకున్నారు కాదు. పెళ్ళి గురించి రీసెర్చి చేశారనుకుంటా ఈ మధ్య వెంకటేశం చేతిలో - 'పెళ్ళి-దాని పుట్టు పూర్వోత్తరాలు' అన్న పుస్తకం చూశా. ఇదెందుకు? శుభ్రంగా పెళ్ళి చేసుకోమని చెప్పి.

**తాపీ:** అలా చెప్పకు. వాళ్ళు మన ఆచారాలు వ్యవహారాలు ఏది ఎందుకు వచ్చిందో అన్నీ తెలుసుకున్నాక పెళ్ళి చేసుకుంటే గుడ్డి నమ్మకాలు లేకుండా హాయిగా వుంటారని నా ఆకాంక్ష.

**మధుర:** ఎలా పెళ్ళాడినా కాపురం ప్రధానం.

**తాపీ:** పూర్వం పెళ్ళాడ్డం కలియడం పిల్లలు పుట్టడం యివన్నీ క్రమంగా జరుగుతాయని

తెలీక - వేరనుకుని ఆలోచించే వారు. పెళ్ళెందుకు, పెళ్ళంటే ఏమిటి, అని చదివి ఆలోచించి పుస్తకం వ్రాశాను. జత కట్టడం ప్రకృతి పని, పెళ్ళి అన్నది మన పని పూర్వం కామవాంఛ గలిగినపుడు జత కూడడమే సహజ కార్యం.

**మధుర:** అవన్నీ మాకెందుకు చెందుతారు; కావలిస్తే కొనుక్కు చదువుకుంటాం -స్టాలిన్ భక్తుల గురించి మావోభక్తుల గురించి చెప్పండి వింటాం.

**తాపీ:** కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన కొందరు స్టాలిన్ భక్తులుంటే వుండవచ్చు మావో భక్తులు మరి కొందరు వుంటే వుండవచ్చు. మన సంస్కృతిని మనమతాన్నీ మన చదువులనీ గౌరవించే వారు లేనే లేరంటావా?

**మధుర:** ఎవరైనా ఉన్నారేమో కాని కమ్యూనిస్టులు మాత్రం కాదు

**తాపీ:** నీకు వారంటే ఎందుకు కినుక?

**మధుర:** వారు ఎవరిని బలపరిస్తే వారు క్షీణించి ప్రాణావశిష్టులై పోతున్నారు (నవ్వు)

**తాపీ:** అంటే - నవ్వకుండా చెప్పు. చెప్పయినా నవ్వు

**మధుర:** కమ్యూనిస్టులు తెలుగుదేశాన్ని బలపర్చారు అది రెండు ముక్కలయింది వారు మాత్రం గట్టిగా అలానే వున్నారు

**తాపీ:** నువ్వు కాంగ్రెస్సా ?

**మధుర:** కాదు నేను మీ రెటుంటే అటు. నాకు మీలా సంగతేమిటో తెలుసుకుందామనే - అంతే అదే నన్ను పాడుచేసింది కూడాను.

**తాపీ:** 'దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు' అలా పుట్టిందే - ఈ పరిశోధన 15 సంవత్సరాలు జరిగింది ఈ విషయాలను గురించి కొన్ని జొన్న కర్రలోనూ, కొండెకాడులోనూ, ఓనమాలలోనూ, తాకీలోనూ వ్రాస్తూ వుండే వాడిని చెప్పబోయేది కటువుగా వున్నా వద్దన్నా మిత్రులు నా చేత రాయించారీ పుస్తకాన్ని

**మధుర:** దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు అనే పుస్తకమేనా?

**తాపీ:** ప్రజామిత్ర పత్రికలో వారం వారం పడిన ఈ వ్యాసాలకు ఆంధ్ర పాఠకులు చూపించిన ఆదరం అపారం

**మధుర:** ఆ రోజుల్లో నేనూ చదివి తిట్టుకున్నా - గిరీశం గారు తెచ్చేవాడు తాతాజీ రచనలు అంటూ

**తాపీ:** దేవుడు అంటే ఆరోజులలో వాళ్ళకున్న అభిప్రాయాన్ని బట్టి సంగమ సమర్పణ ఒక మహా పవిత్రమైన కార్యం అయింది అందుకు దేవాలయాలు మూల స్థానాలు

**మధుర:** ఇదే వాళ్ళకు ముఖ్యమైన పనిగావల్ను కర్మ! కర్మ! ఇంకేం డ్యూటీ లేనట్లు!

**తాపీ:** సంగమ బుద్ధికి ఉద్రేకం కలిగించే విషయాలన్నీ దేవాలయాలకి ముఖ్యమైన అంగాలయ్యాయి కోవెలలు రతికళామందిరాలయాయి, బూతు బొమ్మలతో, గుడి

చేటులతో, నపుంసక పండితులతో నిత్య సంగమాలతో కేళీ మందిరాలయాయి.

**మధుర:** మరి చెప్పకండి. పూటకూళ్ళమ్మ వింటే చీపురుకట్ట తిరగేస్తుంది. (నవ్వు)

**తాపీ:** మన దేశంలో కేవలం నిర్గుణ బ్రహ్మోపాసన నుంచి ఉచ్ఛిష్ట గణపతి ఉపాసన వరకు అన్ని రకాలూ వున్నాయి. నరబలి మొదలు ఆత్మ బలిదానం వరకూ అన్ని లెవెల్సూ ఉన్నాయి. కీడు తియ్యడం, సంతానం కోసం కోవెలలో మూడు రాత్రులు నిద్ర చెయ్యడం లాటి ఆచారాలూ వున్నాయి. ఇటువంటి వాటినన్నిటినీ చారిత్రిక దృష్టితో చూడాలి.

**మధుర:** ఇప్పటి మనస్తత్వంతో అప్పటి సంగతుల్ని చూసి కంగారు పడకూడదంటారు తాతాజీ.

**తాపీ:** అన్నిటిలో పాత సూత్రాలూ కొత్త జీవనమూ ఢీకొంటూ వుంటాయి. సూత్రాలను జీవితంతో మేళవించడం మంచిపని.

**మధుర:** ఆ సమన్వయమే వుంటే అన్నీ చక్కబడతాయి అంటారు అన్నట్లు చేయి తొడకింద పెట్టి ప్రమాణం చేయడం ఏమిటి?

**తాపీ:** అదా - అంటే గోప్యాంగం దేవతా విగ్రహాన్ని ముట్టుకొని చెబుతున్నాను అని ప్రమాణం

**మధుర:** తల్లితోడు అక్క తోడు అంటారు అదీ యింతేనా?

**తాపీ:** ఆ అదే - గోప్యాంగ సంపర్కమే కనిపిస్తోంది ఎదటి వారిని కట్టడి చెయ్యాలంటే మన ఆడవాళ్ళు నన్ను చంపుకుతిన్నట్లే అని ఒట్టువేస్తూ వుంటారు.

**మధుర:** మన కోర్టుల్లో యింకా దేవుడి మీద అని ప్రమాణాలు చేయిస్తూ వుంటారు ఇది అవసరమా?

**తాపీ:** కూట సాక్ష్యం చెప్పిన వ్యక్తి కూడా ఆ ప్రమాణమే చేస్తాడు అంటే ప్రమాణం మీద గౌరవ భావం అంతరించినట్లే కదా దేవుడ్ని కోర్టులోకి రప్పించడం ఎందుకు? ఆ ఆచారం యిప్పుడు నిరుపయోగం అయిపోయింది

**మధుర:** ఈ వెంకటేశ్వర స్వామికి జుట్టు యివ్వడం అసలు ఎలా వచ్చింది?

**తాపీ:** పండగ నాడూ పాత మొగుడేనా అని ఒక ఆవిడ రవికల పండుగలో విచారించిందట పూర్వం వ్యభిచారం రెచ్చిపోయి సాగేదట వ్యభిచారం యిష్టం లేని వాళ్ళు తలవెంద్రుకలను సమర్పిస్తే చాలునని ఓ చక్రవర్తి రూలు ప్యాస్ చేశాడు. అవమాన మనండి శిక్ష అనండి వెంద్రుకలను యివ్వడం ఆచారమయింది రాను రాను వ్యభిచారం పోయి జుత్తు యివ్వడంతో తీరింది ఆరాధన.

**మధుర:** ఒకప్పుడు 'స్త్రీకి ఒక భర్త' అన్న రూలులేదని తెలుస్తోంది. ఇప్పటి దృష్టి వేరు. అప్పటి వ్యవహారాలు వేరు ఇదే రైటు అది తప్పని ఎలా చెప్పగలం?

**తాపీ:** పండితులు జాగ్రత్తగా వుండాలి. తొందర పడకూడదు.

**మధుర:** తమకు చుట్ట ఎలా అలవాటయిందీ తెలుసుకోవచ్చా?

**తాపీ:** పర్లాఖిమిడిలోనే నాకీ చుట్ట కాల్చడం అలవాటయింది. ఒక బొబ్బిలి విద్యార్థి కాన్స్టిపేషన్‌కు మందుగా చుట్ట కాల్చడం నేర్పాడు. మిత్రుడు చెప్పిన మాటలన్నీ శిలాక్షరాలు. చుట్ట నాకు తారక మంత్రం అయింది.

**మధుర:** మీరు లెక్కల మేష్టారు కదా, తెలుగు సర్దాకి కారణం ఏమిటి?

**తాపీ:** సుసర్ల సత్యనారాయణ అని ఓ బొబ్బిలి విద్యార్థినా దగ్గరకు వచ్చి చక్కని పద్యాలు బాగా చదువుతూ వుండేవాడు. ప్రబంధాలలోంచి పద్యా లేరి వెంకటగిరి సంస్థానం వారు ఒక పుస్తకం వేశారు. నేను కోరగా ఖర్చులన్నీ వారే పెట్టుకుని దాదాపు ఇరవై పుస్తకాలు పంపించారు. అలా ఏర్పడింది నా ప్రబంధ పరిచయం, విద్యా తృష్ణ.

**మధుర:** గిడుగు రామ్మూర్తి పంతులుగారి గురించి చెప్పండి. మీ రాయన అభిమాన విద్యార్థి కూడా నటగా-

**తాపీ:** మా మేస్టరు గారి హృదయం వజ్రాయుధంకంటె కఠోరంగా వుండగలదు. పూవు కంటె మృదువుగానూ వుండగలదు. వారు పర్లాఖిమిడిని తమ మాతృభూమిగా గణించారు. ఆ ప్రాంతీయుల అభ్యుదయానికి చాలా శ్రమ తీసుకున్నారు. సవరజాతి వారిని ఆత్మీయులుగా భావించి వారికి లిపి సౌభాగ్యాన్ని కల్పించారు. ఇంత అభిమానంతో చూచిన ఆ ప్రదేశాన్ని ఘోరమైన ప్రతిజ్ఞ పట్టి త్యజించగలిగారు. మళ్ళీ పర్లాఖిమిడి ముఖం చూడనని శపథం పట్టారు, చూడకుండానే దివంగతులయ్యారు. మంచి కయినా చెడ్డకయినా పట్టినదే పట్టు. హరిహర బ్రహ్మాదులైనా ఆ పట్టు సడలించలేరు.

**మధుర:** ధన్యులు. ఆయనతోబాటు మీరూనూ వారికోర్కె తీర్చాలని వ్యావహారిక భాషను పత్రికలలో ప్రవేశపెట్టి ఆయనకు గొప్ప తృప్తినిచ్చారు. ప్రజల భాష ద్వారా సినిమా రంగాన్ని జనం మధ్యకు తీసుకువచ్చారు. నార్ల మీ లైన్లో ముందుకు వెళ్ళి సంపాదకీయం వ్యాసాలకు శీర్షికలకు వన్నె తెచ్చారు.

**తాపీ:** ఇంతకీ ఏమంటావు? (నవ్వు)

**మధుర:** ఏమంటాను? నవ్యాంధ్ర జాతినిర్మాతలు మీరంటాను (నవ్వు) ★

*("మిసిమి" - మే, జూన్ 1992)*